

అన్నదానానికి 1,166 డాలర్లు

ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): దుర్గమ్మ సన్నిధిలో నిత్యాన్నదానానికి టి.సూర్యకుమార్ (కాకినాడ) 1,166 యూఎస్ డాలర్లు విరాళంగా అందించారు.



కనుమరుగు

రత్నగిరిపై భక్తుల కోసం నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా మారాయి. గత నవంబర్‌లో రూ.10 లక్షలతో వీటిని నిర్మించారు.

8లో

రత్నగిరిపై రయ్‌రయ్..



సత్యదేవుని ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం అన్నవరం దేవస్థానం ఆగస్టు నెలాఖరు నుంచి మరో రెండు కొత్త బస్సులను నడపనుంది. దానిలో భాగంగా అశోక్ లైలాండ్ కంపెనీకి చెందిన రెండు బస్సు చాసిస్‌లను రూ.57 లక్షలతో కొనుగోలు చేశారు.

న్యూస్‌రీల్

275 టన్నుల పశువుల దాణా దిగుమతి

కొత్తపేట: గోదావరి వరదల నేపథ్యంలో జిల్లాలోని లంక గ్రామాల్లో పశువులకు 275 టన్నుల దాణాను దిగుమతి చేసినట్టు జిల్లా పశుసంవర్ధక అధికారి (డీఏహెచ్‌ఓ) డాక్టర్ కొమ్మన వెంకట్రావు తెలిపారు. జిల్లాలోని లంక గ్రామాలు, సురక్షిత ప్రాంతాల్లోని పశువైద్య శిబిరాల సందర్శనలో భాగంగా ఆయన బుధవారం కొత్తపేట మండలం వానపల్లి సత్తెమ్మలంకలో పర్యటించారు. స్థానిక పశువైద్యాధికారులతో వివిద అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 14 మండలాల్లోని 54 లంక గ్రామాల నుంచి సుమారు 12 వేల పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించామన్నారు. ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన పశు వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయని తెలిపారు. లంక భూముల్లోకి వరద చేరి పశుగ్రాసానికి కొరత ఏర్పడడంతో పశువులకు దాణా అవసరం ఏర్పడిందన్నారు. 275 టన్నుల దాణా దిగుమతి కాగా ఇంకా కొంత రావాల్సి ఉందని తెలిపారు. మంగళవారం నుంచి దాణా పంపిణీ ప్రారంభించామని, ఒక పశువుకు రోజుకు 5 కేజీల చొప్పున 5 రోజులకు 25 కేజీలు దాణా అందజేస్తున్నామన్నారు. ఆయన వెంట ఏడీహెచ్, కొత్తపేట ఏరియా పశువైద్యాధికారి డాక్టర్ చీకట్ల వెంకటనారాయణ, మండల పశువైద్యాధికారి డాక్టర్ రేవంత్‌కుమార్, బీర రమేష్ ఉన్నారు.

దేవస్థానం ఏసీగా మాచిరాజు



ఐ.పోలవరం: దేవదాయ, ధర్మాదాయ శాఖ జిల్లా అసిస్టెంట్ కమిషనర్‌గా మురమళ్ల దేవస్థానం గ్రేడ్ -1 కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ నియమితులయ్యారు. ఈ మేరకు ఆశాఖ కమిషనర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం మురమళ్ల ఈవోగా ఉన్న లక్ష్మీనారాయణ గతంలో జిల్లాలోని అయినవిల్లి, అంతర్వేది, అప్పనపల్లి దేవస్థానాలలో ఈవోగా సేవలందించారు.

ఏపీఈపీడీసీఎల్ ఎస్‌ఈగా గొర్ల ప్రసాద్

టీవీఎస్ఎన్ మూర్తి విశాఖకు బదిలీ

సాక్షి, రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (ఏపీఈపీడీసీఎల్) రాజమహేంద్రవరం సర్కిల్ ఎస్‌ఈగా గొర్ల ప్రసాద్ నియమితులయ్యారు. కాకినాడలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న ఆయనను పదోన్నతిపై రాజమండ్రి సర్కిల్‌లో నియమించారు. ఈ మేరకు ఈస్ట్రన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ (ఈపీడీసీఎల్) సీఎండీ పృథ్వీతేజ్ బుధవారం ఉత్తర్వులు వెలువరించారు. ఇక్కడ ఎస్‌ఈగా వ్యవహరిస్తున్న టీవీఎస్ఎస్ మూర్తిని పదోన్నతిపై విశాఖపట్నంలోని విద్యుత్ శాఖ కార్పొరేట్ కార్యాలయంలో సీజీఎం(ప్రాజెక్టు)కు బదిలీ చేశారు.

ముందే చెప్పిన 'సాక్షి'

రాజమండ్రి సర్కిల్ ఎస్‌ఈగా వచ్చేందుకు కాకినాడకు చెందిన ఓ అధికారి ముమ్మర ప్రయత్నాలు చేస్తున్న విషయాన్ని 'సాక్షి' ముందే చెప్పింది. ఈ విషయమై ప్రత్యేక కథనం సైతం ప్రచురించింది. నాడు సాక్షి చెప్పిందే నేడు నిజమైంది. కాకినాడలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న గొర్ల ప్రసాద్ నియామకానికి గ్రీన్ సిగ్నల్ అందింది. నూతన ఎస్‌ఈగా నియమితులైన ప్రసాద్ గురువారం బాధ్యతలు తీసుకునే అవకాశం ఉంది.

18న జాతీయ శతాధిక కవి సమ్మేళనం

అమలాపురం టౌన్: అమలాపురంలోని కలెక్టరేట్‌కు ఎదురుగా గల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో ఈ నెల 18వ తేదీన 138వ జాతీయ శతాధిక కవి సమ్మేళనం జరగనుంది. శ్రీశ్రీ కళావేదిక జిల్లాశాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లను బుధవారం ఆవిష్కరించారు. స్థానిక భూపయ్య అగ్రహారంలోని రుద్రరాజు ఆడిటోరియంలో శ్రీశ్రీ కళావేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు, వేదిక ప్రతినిధుల చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నానిరాజుతో పాటు వేదిక జిల్లా అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, జాతీయ ఆర్గనైజింగ్ సెక్రటరీ మాకే బాలార్జున సత్యనారాయణ, సాంస్కృతిక విభాగం కన్వీనర్ కడలి సత్యనారాయణ కవి సమ్మేళనం వివరాలను వెల్లడించారు. తెలుగు భాషా వైభవం, తెలుగు విశిష్టత, తెలుగుదనం ఉట్టిపడేలా కవులు తమ కవితాగానాలు వినిపించాలని కోరారు. 18వ తేదీ ఉదయం అమలాపురంలోని గడియారం స్తంభం సెంటర్‌లో తెలుగుభాషను, కవులను కీర్తిస్తూ ప్రదర్శన ఏర్పాటు చేశామన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం, వ్యవహారిక భాషోద్యమకారుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా ఈ జాతీయ కవి సమ్మేళన వేదికపై తెలుగు సంబరాలు జరుగుతాయన్నారు. అంతర్జాతీయ సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్ నిర్వహణలో ఈ కవి సమ్మేళనం జరుగనుందని ఆ వేదిక జిల్లా కన్వీనర్ బీవీవీ సత్యనారాయణ తెలిపారు.

వరదతో వలవిల

- వేట లేక మత్స్యకారుల అవస్థలు
- 14 రోజులుగా ఇదే పరిస్థితి
- మరో నాలుగు రోజులు కొనసాగే అవకాశం



అల్లవరం మండలం బోడసుకుర్రు వద్ద నీట మునిగిన మత్స్యకార కాలనీ



ఐ.పోలవరం మండలం మురమళ్ల రాఘవేంద్ర వారధి వద్ద వరదల వల్ల నిలిచిన వేట పడవలు

సాక్షి అమలాపురం: గోదావరి వరద కారణంగా వేట నిలిచిపోవడంతో నదీతీర ప్రాంతాలలో మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయారు. సాధారణ వరద బాధితులకు ఇస్తున్నట్టుగా అరకొర పరిహారం కాకుండా, సముద్ర వేట నిషేధ సమయంలో ఇస్తున్నట్టుగా రూ.పది వేల చొప్పున అందజేయాలని వీరంతా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. సముద్ర తీర ప్రాంతాల్లో మత్స్యకారులు ఏటా 45 రోజుల పాటు వేట నిషేధంలో సమయంలో వేటకు దూరంగా ఉంటారు. అయితే గోదావరి నదీపాయల్లో వేటాడుకునే మత్స్యకారులు సైతం జూలై 15 నుంచి ఆగస్టు నెలాఖరు వరకు గోదావరికి వచ్చే వరదల వల్ల వేటకు దూరంగా ఉంటున్నారు. గోదావరికి రెండుసార్లు తాకిన వరద వల్ల గడిచిన 13 రోజులకు వేట లేక పలువురు మత్స్యకారులు జీవనోపాధి కోల్పోయారు.

గోదావరికి వరద ఉధృతి

గోదావరికి ఈ నెల 19న వరద పోటెత్తింది. ఇప్పటి రెండుసార్లు భారీ వరద వచ్చింది. దీనితో గౌతమీ, వృద్ధ గౌతమీ, వైనతేయ, వశిష్ట నదీపాయల్లో వేట మీద జీవనం సాగించే వందలాది మంది మత్స్యకారులకు జీవనాధారం పోయింది. పడవలు, దోనెల మీద వేట సాగిస్తూ వీరు చేపలు, రొయ్యలు, పీతలు వంటి మత్స్య సంపద వేటతో జీవనోపాధి పొందుతుంటారు. కె.గంగవరం మండల పరిధిలోని కోటిపల్లి, మసకపల్లి, కపిలేశ్వరపురం, బ్రహ్మపురి, బోదిలంక, శేరులంకల్లో మత్స్యకారులు నదీపాయల్లో వేట మీద జీవనం సాగిస్తుంటారు. ఇక్కడ సుమారు 6 వేల మంది వరకు ఉంటారని అంచనా. కాకినాడ జిల్లా పరిధిలోని తాళ్లరేవు, పుదుచ్చేరి యానాంలో సైతం మత్స్యకారులు గోదావరి వేట మీదనే జీవనం సాగిస్తారు. ముమ్మిడివరం మండలం లంకాఫ్ ఠాన్నేల్లంక, గురజాపులంక, ఐ.పోలవరం మండలం మురమళ్ల, జి.మూలపొలం, పశువుల్లంక, కేశనకుర్రు, గుత్తెనదీవి, భైరవపాలెం, గోగుల్లంక, కాట్రేనికోన మండలం పల్లంకుర్రు, బలుసుతిప్ప, కొత్తపాలెం, మెల్లేటిమొగ, అయినవిల్లి మండలం అయినవిల్లి, తొత్తరమూడి, చింతనలంక, మామిడికుదురు మండలం పాశర్లపూడి, పాశర్లపూడిలంక, పెదపట్నంలంక, అప్పనపల్లి, అంబాజీపేట మండలం వాకలగరువు, తొండవరం, పి.గన్నవరం మండలం జొన్నలలంక, ముంజువరం, కె.ఏనుగుపల్లి, సఖినేటిపల్లి మండలం అప్పనరామునిలంక, సఖినేటిపల్లి లాకుపేట, టేకిశెట్టిపాలెంలో నదీపాయలపై వేట చేసుకునే మత్స్యకారులు అధికంగా ఉన్నారు.

వేటకు దూరం

గోదావరికి వరదలు వచ్చిన ప్రతిసారీ వీరు వేటకు దూరమవుతారు. గోదావరికి తొలి ప్రమాద హెచ్చరిక జారీ చేయగానే వేట నిలిచిపోతుంది. ఈసారి కూడా అదే జరిగింది. అయితే రెండుసార్లు వరద పోటెత్తడంతో పది, మూడు రోజులుగా వేట లేకుండా పోయింది. వరద తగ్గినా ఉధృతి వీడనందున మరో మూడు, నాలుగు రోజులు వేట చేసే అవకాశం లేదు. పక్షం రోజుల పాటు వేట లేకుండా పోయిందని మత్స్యకారులు వాపోతున్నారు. వీరు వేటను బట్టి రోజుకు రూ.వెయ్యి నుంచి రూ.1,500 వరకూ సంపాదిస్తారు.

ముంపు బారిన..

వరద కారణంగా ముందుగా మత్స్యకార కాలనీలే మునిగిపోతాయి. గోదావరి ఒడ్డున ఉండడంతో ముందుగా వీటికే నష్టం కలుగుతుంది. కాటన్ బ్యారేజీ వద్ద రెండో ప్రమాద హెచ్చరిక దాటి గోదావరి ప్రవహించగానే దాదాపు మత్స్యకార కాలనీలన్నీ ముంపులో చిక్కుకుంటాయి. అందరితో పాటు వీరికి సైతం సాధారణంగా ఇచ్చే పరిహారమే ఇస్తున్నారు. బాధిత కుటుంబాలకు ఇస్తే కొంత నగదు పరిహారం, ఆపై నిత్యావసర వస్తువులు మాత్రమే ఇస్తున్నారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలో కేవలం నిత్యావసర వస్తువులు మాత్రమే అందాయి. అది కూడా కొంతమందికి మాత్రమే. సముద్ర వేట నిషేధం సమయంలో మత్స్యకారులకు ఇస్తున్నట్టుగా వరదలలో నష్టపోయిన మత్స్యకారులకు సైతం రూ.పదివేలు చొప్పున పరిహారం అందించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

బియ్యం, పప్పులే ఇచ్చారు



వరద వల్ల వేట ఆగిపోయింది. బుధవారం నుంచి నది అంచులలో వేట సాగిస్తున్నాను. ఇన్ని రోజులు వేట చేయపోవడం వల్ల అప్పులు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వం ఇప్పటి వరకూ బియ్యం, పప్పులు మాత్రమే అందించింది. నగదు పరిహారం ఇవ్వలేదు.

– కె.వరదరాజు, జి.మూలపొలం, ఐ.పోలవరం మండలం

రూ.పదివేల పరిహారం ఇవ్వాలి



వరదల కారణంగా ఏటా 20 నుంచి 30 రోజులు పాటు వేట లేకుండా పోతోంది. మాకు నదిలో వేటాడితే వచ్చే ఆదాయం చాలా తక్కువ. వరదల సమయంలో అది కూడా లేకపోతే తిన దానికి కూడా ఉండడం లేదు. మిగిలిన మత్స్యకారులకు సముద్ర వేట నిషేధ సమయంలో ఇస్తున్నట్టుగా పరిహారం అందించాలి.

– సంగడి కృపా ప్రసాద్, మసకపల్లి, కె.గంగవరం మండలం



కొత్తపేట మండలం వాడపాలెం సమీపంలో ముంపునకు గురైన అరటి పంట



కొత్తపేట మండలం వానపల్లి సమీపంలో దెబ్బతిన్న కూరపాదులు

ముంపులోనే పంటలు

కొత్తపేట: గోదావరికి ఉధృతంగా వరదలు రావడంతో నదీపరివాహక లంక భూముల్లో ఉద్యాన పంటలు నీట మునిగాయి. వారం రోజులుగా నీరు నిల్వ ఉండిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. ముఖ్యంగా అరటి, కూర పాదులు, బొప్పాయి, తమలపాకు, పసుపు పంటలు నీట మునిగి నాసుతున్నాయి. జిల్లా పరిధిలోని లంక ప్రాంతాల్లో ఉద్యాన శాఖ అధికారులు పర్యటించి, పంట నష్టాలను నమోదు చేస్తున్నారు. ప్రాథమిక అంచనాల ప్రకారం 14 మండలాల పరిధిలోని 72 గ్రామాల్లో 7,358 మంది రైతులకు చెందిన 5,996.30 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని జిల్లా ఉద్యానశాఖ అధికారి బీవీ రమణ తెలిపారు.

జిల్లాలో వివరాలు

పంటలు	విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
అరటి	2,345.55	2,757
కూరపాదులు	3,325.00	4,182
బొప్పాయి	207.50	239
తమలపాకు	99.25	162
పువ్వులు	19.00	18
మొత్తం	5,996.30	7,358

వరద నీరు తగ్గాక సస్యరక్షణ



గోదావరి వరదల వల్ల లంక భూముల్లో పంటలకు నష్టం వాటిల్లుతోంది. నీరు ఎక్కువ రోజులు నిల్వ ఉండకుండా ఉంటే నష్టం తక్కువగా ఉంటుంది. ముఖ్యంగా అరటి పంట మొక్క దశలో ఉంటే నష్టం కలుగుతుంది. కూరపాదులు, పసుపు పంటలకు కూడా నష్టం కలుగుతుంది. నీరు లాగిన వెంటనే ఉద్యాన అధికారుల సూచనలు, సలహాలు పాటిస్తూ రైతులు ఆయా పంటలను సంరక్షించుకోవాలి. ప్రాథమికంగా ఎంత విస్తీర్ణంలో పంటలు దెబ్బతిన్నాయో అంచనా వేశాం. నీరు పూర్తిగా తగ్గాక పంటల పరిస్థితి పరిశీలించి, నష్టం అంచనా వేసి నివేదిక రూపొందిస్తాం.

– బీవీ రమణ, జిల్లా ఉద్యాన అధికారి, అమలాపురం

'ఉచిత ఇసుక' ఫిర్యాదులపై నివేదిక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం రూరల్: రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఉచిత ఇసుక పంపిణీ కార్యక్రమంపై వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు విచారించి, నివేదిక సమర్పించాలని ఎస్‌ఈబీ, ఖనిజాభివృద్ధి సంస్థ అధికారులను కలెక్టర్, జిల్లా స్థాయి ఇసుక కమిటీ అధ్యక్షుడు ఆర్.మహేష్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక సరఫరాకు సంబంధించి ఆన్‌లైన్ టోల్ ఫ్రీ నెంబర్ ద్వారా అందిన ఫిర్యాదులపై తక్షణమే స్పందించాలన్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా స్టాక్ యార్డులలో ఇసుక సరఫరా అవుతోందని, జొన్నాడ స్టాక్ యార్డ్ ముంపులో ఉందన్నారు.

డీలర్ వ్యవస్థను పునరుద్ధరించాలి

మొబైల్ డిస్పెన్సరీ యూనిట్ ద్వారా నిత్యావసరాలు సరఫరా చేయడం వల్ల చాలా ఇబ్బందులు ఎదురవుతున్నాయని, పూర్వపు డీలర్ వ్యవస్థను పునరుద్ధరించి అమలయ్యేలా చూడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిషాంతి అన్నారు. ఆమె బుధవారం పౌరసరఫరాల అధికారులు, మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ కేంద్రాలు, సాంఘిక సంక్షేమ, బీసీ సంక్షేమ వసతి గృహ అధికారులు నుంచి సూచనలు, సలహాలు స్వీకరించారు.

మత్స్యకార సంఘాలతో సమావేశం

తీరప్రాంతంలోని మత్స్యకార సంఘాలు, స్థానిక వర్గాలకు జీవనోపాధి, భద్రతతో పాటు, తీరప్రాంత సముద్ర ప్రాంతాల ప్రత్యేక పర్యావరణాన్ని రక్షించేందుకు 2011 సీఆర్ జెడ్ కంటే 2019 సీఆర్‌జెడ్‌ను సవరించారని జేసీ నిషాంతి అన్నారు. 2019 కోస్తా జోన్ మేనేజ్‌మెంట్ ప్లాన్ ముసాయిదా(సీఆర్‌జెడ్)పై బుధవారం కలెక్టరేట్‌లో ప్రజాభిప్రాయసేకరణ, తీరప్రాంత మత్స్యకార సంఘాల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు.

శాంతించిన వరద

- వీడుతున్న ముంపు
- తేరుకుంటున్న లంకలు



అయినవిల్లి మండలం వీరవల్లిపాలెంలో రహదారిపై వరద నీరు



సఖినేటిపల్లి లాకుపేటలో ఇంటి వద్దకు చేరిన నీరు



పి.గన్నవరం మండలం బూరుగులంకలో పడవలపై రాకపోకలు సాగిస్తున్న ప్రజలు

సాక్షి అమలాపురం: గోదావరి వరద తగ్గుముఖం పడుతోంది. లంక గ్రామాలను ముంచెత్తిన వరద చాలా వరకు తగ్గుతోంది. ముంపులోని ఇళ్లు బయటపడుతున్నాయి. మెరక ప్రాంతాల్లోని రోడ్లు, కాజ్‌వేలు, వంతెనలపై ముంపునీరు వీడుతోంది. పూర్తిగా సాధారణ పరిస్థితులు నెలకొన్న తర్వాత పంట, ఇతర నష్టాల నమోదు ప్రక్రియ మొదలు కానుందని అధికారులు చెబుతున్నారు. ధవళేశ్వరం బ్యారేజ్ నుంచి రాత్రి ఏడు గంటల సమయంలో 10.41 లక్షల క్యూసెక్కుల వరద నీటిని దిగువకు విడుదల చేశారు. భద్రాచలం వద్ద వరద ఉధృతి ఉదయం స్వల్పంగా పెరిగి, సాయంత్రం నుంచి తగ్గుతోంది. ఈ ప్రభావం జిల్లాలోని లంక గ్రామాలపై పెద్దగా ఉండదని అంచనా వేస్తున్నారు. బ్యారేజ్ నుంచి వరద నీరు రాక తగ్గడంతో లంక గ్రామాల్లో ముంపు నెమ్మదిగా వీడుతోంది. రెండు వారాలుగా వరద ఉధృతి వల్ల జిల్లాలో పి.గన్నవరం, మామిడికుదురు, అయినవిల్లి, ముమ్మిడివరం, ఐ.పోలవరం, కె.గంగవరం, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో సుమారు 47 గ్రామాలు, శివారు గ్రామాలు ముంపు బారిన పడిన విషయం తెలిసిందే. అయినవిల్లి మండలం ఎదురుబిడియం, మామిడికుదురు మండలం అప్పనపల్లి కాజ్‌వేలపై వరద నీరు గణనీయంగా తగ్గింది. ఇంకా వాహనాల రాకపోకలకు అధికారులు అనుమతి మంజూరు చేయలేదు. పడవలు కూడా నిలిపివేయడంతో లంక వాసులు కాలినడకన రేవులు దాటుతున్నారు. మరోవైపు పి.గన్నవరం అక్విడెక్టు వద్ద వరద ఉధృతి చాలా వరకు తగ్గింది. కె.ఏనుగుపల్లి వద్ద వరద ఉధృతికి సీసీ రోడ్డు కోతకు గురైంది. మానేపల్లిపల్లిపాలెం వరద ముంపు నుంచి బయటపడింది. కనకాయిలంక కాజ్‌వేపై వరద నీరు కొనసాగుతోంది. సఖినేటిపల్లి మండలం సఖినేటిపల్లి రేవు, లాకుపేట, అప్పన రాముని లంక, టేకిశెట్టి పాలెంలో వరద చాలా వరకు తగ్గింది. ప్రధాన రహదారులపై వరద నీరు దిగడంతో రాకపోకలు మొదలయ్యాయి. లంక గ్రామాల్లోని శివారు పొలాలు, తోటల్లో వరద కొనసాగుతోంది.

పాఠశాల కమిటీల ఎన్నికలకు మోగిన నగారా

- నేటి నుంచి ప్రక్రియ ప్రారంభం
- 8వ తేదీన ఎన్నికలు



రాయవరంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

రాయవరం: పాఠశాలల్లో ఎన్నికలకు నగారా మోగింది. గత ప్రభుత్వ హయాంలో ఏర్పాటు చేసిన పేరెంట్స్ మానిటరింగ్ కమిటీల స్థానంలో పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ)ల ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు ఎన్నికలకు నోటిఫికేషన్‌ను సమగ్ర శిక్షా రాష్ట్ర పథక సంచాలకులు బుధవారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో గురువారం నుంచి పాఠశాలల్లో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కానుంది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 2021 సెప్టెంబర్ 22న ఏర్పాటైన పేరెంట్స్ మానిటరింగ్ కమిటీల కాలపరిమితి 2023 సెప్టెంబర్ 21తో ముగిసింది. అనంతరం పాత వాటినే కొనసాగించారు. జిల్లాలో 1,575 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు జరగనున్నాయి.

ఎన్నికలు జరిగే విధానం

పాఠశాలల్లో గురువారం ఉదయం పది గంటల నుంచి ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 2 గంటలకు నోటీసుబోర్డుల్లో ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. ఈ నెల 5వ తేదీ ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ ఓటరు జాబితాపై అభ్యంతరాలను స్వీకరిస్తారు. అనంతరం 3 నుంచి 4 గంటల లోపు తుది జాబితాను విడుదల చేస్తారు. ఈ నెల 8వ తేదీ ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ ఎస్ఎంసీ సభ్యుల ఎన్నిక జరుగుతుంది. మధ్యాహ్నం 1.30 గంటలకు చైర్మన్, వైస్ చైర్మన్లను ఎన్నుకుంటారు. 2 గంటలకు ఎస్ఎంసీ సభ్యులు ప్రమాణ స్వీకారం చేస్తారు. అనంతరం 3 నుంచి 3.30 వరకూ కమిటీ మొదటి సమావేశం జరుగుతుంది.

నిబంధనలు ఇవే..

- అన్ని ప్రభుత్వ యాజమాన్య పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో ఎస్ఎంసీలు ఏర్పాటు చేయాలి. ఎన్నికలకు 50 శాతం విద్యార్థుల తల్లిదండ్రులు, సంరక్షకులు హాజరుకావాలి. కోరం కోసం అవసరమైతే సమయాన్ని హెచ్ఎం పెంచవచ్చు.
- చేతులు ఎత్తే విధానం, నోటి ద్వారా తెలపడం తదితర పద్ధతులతో ఎస్ఎంసీ సభ్యుల, చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక జరుగుతుంది. ప్రత్యేక పరిస్థితుల్లో మాత్రం రహస్య ఓటింగ్ జరపవచ్చు.
- విద్యార్థుల తల్లిదండ్రులలో ఒక్కరికే ఓటువేసే హక్కు ఉంటుంది. ఎస్ఎంసీకి ఎన్నికైన సభ్యులలో చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకుంటారు. వీరిలో ఒకరు వెనుకబడిన తరగతులకు చెందిన వారై, వారిలో ఒకరు మహిళ అయి ఉండాలి.
- ఎస్ఎంసీ ఎన్నికల్లో రాజకీయ జోక్యం ఉండకూడదు. ఎన్నికలకు అంతరాయం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. తహసీల్దార్, ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శి, వీఆర్వో, వీఆర్ఏ పరిశీలకులుగా ఎన్నికల ప్రక్రియలో పాల్గొనవచ్చు.

ఎన్నికల నిర్వహణకు చర్యలు



పాఠశాల యాజమాన్య కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల నిర్వహణకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. కలెక్టర్ పర్యవేక్షణలో ఎన్నికలను సమర్థంగా నిర్వహించేందుకు మండల విద్యాశాఖాధికారులు, ప్రధానోపాధ్యాయులకు అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నాం. ఈ నెల 8న ఎస్ఎంసీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలి.

– ఎ.మధుసూదనరావు, అదనపు ప్రాజెక్టు కోఆర్డినేటర్, సమగ్ర శిక్షా, అమలాపురం.

పోటీ చేసే వారి అర్హతలు

ఎస్ఎంసీ సభ్యులుగా పోటీచేసేవారి పిల్లలు ఆయా పాఠశాలల్లో ఒకటి నుంచి పదోతరగతి చదువుతూ ఉండాలి. తరగతికి ముగ్గురు చొప్పున సభ్యులను ఎన్నుకుంటారు. వారిలో ఇద్దరు తప్పనిసరిగా మహిళలై ఉండాలి. ముగ్గురిలో ఒకరు అననుకూల వర్గం (డిజ్ అడ్వాంటేజ్ గ్రూపు) నుంచి, రెండోవారు బలహీన వర్గం, మూడోవ్యక్తి జనరల్ కేటగిరి నుంచి ఎన్నిక చేయాలి. ఎస్ఎంసీకి తొలుత ప్రతి తరగతి నుంచి ముగ్గురు వంతున ఎంపిక చేస్తారు. పాఠశాల యాజమాన్య కమిటీలో ఆరుగురు ఎక్స్‌అఫీషియో సభ్యులు, ఇద్దరు కోఆప్టెడ్ సభ్యులను నామినేట్ చేస్తారు. సభ్యుల పదవీ కాలం రెండేళ్లు ఉంటుంది. దానికి ముందుగా పిల్లల చదువు పూర్తయినా, పిల్లలు మధ్యలో వేరే పాఠశాలకు మారినా పదవిని కోల్పోతారు.

ఆర్థిక సంక్షోభం దిశగా చంద్రబాబు ప్రభుత్వం



బొమ్మి ఇజ్రాయిల్, ఎమ్మెల్సీ

అల్లవరం: చంద్రబాబు నాయకత్వంలో ఏర్పడిన కూటమి ప్రభుత్వం వల్ల ఆర్థిక సంక్షోభం ఏర్పడే పరిస్థితులు కనిపిస్తున్నాయని ఏపీ శాసన మండలి సభ్యుడు బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. ఈ మేరకు బుధవారం ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల సమయంలో సాధ్యం కాని హామీలను ఇచ్చి కూటమి అధికారంలోకి వచ్చిందన్నారు. తీరా అధికారంలోకి వచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేయడానికి భయమేస్తోందని స్వయంగా ముఖ్యమంత్రే అనటం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఆ పథకాలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో అమ్మఒడి ద్వారా తల్లుల ఖాతాలకు రూ. 15 వేలు, రైతు భరోసా ద్వారా రైతులకు రూ.13,500, విద్యా దీవెన, వసతి దీవెన పథకాల లబ్ధి, మత్స్యకార భరోసా ఇలా అన్ని సక్రమంగా అందజేసేవారన్నారు. 2019లో చంద్రబాబు పదవి నుంచి దిగిపోయే సమయానికి ప్రభుత్వ ఖజానాలో కేవలం రూ.100 కోట్లు నిల్వ ఉంచారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దిగిపోయే సమయానికి ప్రభుత్వ ఖజానాలో రూ.7,000 కోట్ల నిల్వ ఉందన్నారు. కేంద్రం నుంచి రూ.5,600 కోట్లు నిధులు మంజూరైతే మొత్తంగా రూ.13 వేల కోట్లు ఖజానాలో ఉండి కూడా ఇంతవరకు ఏ సంక్షేమ పథకం అమలు చేయలేదన్నారు.

క్లుప్తంగా

అనుమానాస్పదస్థితిలో వ్యక్తి మృతి

ఏలేశ్వరం: మండలంలోని సి.రాయవరం గ్రామానికి చెందిన గజ్జి అప్పన్న (60) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. గ్రామంలోని ఊటగుంతలో అతడు పడి ఉండటాన్ని బుధవారం స్థానికులు గమనించారు. దగ్గరకు వెళ్లి చూడగా అప్పన్న మృతి చెంది ఉన్నాడు. అతడి ఒంటిపై గాయాలున్నాయి. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రత్తిపాడు ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ విద్యార్థి..

కొత్తపల్లి: పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఉప్పాడ వీవర్స్ కాలనీకి చెందిన నాదెండ్ల వరుణ్ (17) ఇంటర్ మొదటి సంవత్సరంలో నాలుగు సబ్జెక్టులలో ఫెయిల్ అయ్యాడు. దీంతో మనస్తాపానికి గురై గత నెల 16వ తేదీన పురుగుమందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. అతడిని చికిత్స కోసం కాకినాడలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఈ ఘటనపై హెడ్ కానిస్టేబుల్ రాజారావు కేసు నమోదు చేశారు.

మృతదేహం లభ్యం

సఖినేటిపల్లి: మలికిపురం సరిహద్దులోని టేకిశెట్టిపాలెం వద్ద పంట కాలువలో ప్రమాదవశాత్తూ పడి గల్లంతయిన సఖినేటిపల్లి గ్రామానికి చెందిన చీర్ల దుర్గారావు మృతదేహం బుధవారం లభ్యమైంది. సఖినేటిపల్లి సమీపంలోని పరంజ్యోతి చర్చి దగ్గర కాలువలో తేలింది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టానికి పంపినట్లు ఎస్సై రాము తెలిపారు.

మద్యం తాగి వాహనాలు నడిపిన వారికి జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్‌లు నడిపిన ఆరుగురికి రెండు రోజుల జైలు, మరో 12 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్–1, త్రీ టౌన్, తిమ్మాపురం స్టేషన్ పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని గుర్తించి కేసులు నమోదు చేశారు. నిందితులను బుధవారం కోర్టులో హాజరుపర్చగా ఆరుగురికి రెండు రోజులు జైలు శిక్ష, 12 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

మరో కోర్టులో..

కాకినాడ వన్ టౌన్, తాళ్లరేవు మండలం కోరంగి పోలీసు స్టేషన్ పరిధిలో మద్యం తాగి బైక్ నడుపుతున్న వారిని డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలో పోలీసులు పట్టుకుని కేసులు నమోదు చేశారు. వారిలో ఐదుగురికి రెండు రోజుల జైలు, తొమ్మిది మందికి ఒక్కొక్కరికీ రూ.10 వేలు జరిమానా విధిస్తూ కాకినాడ ఒకటో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ హెచ్.వీరభద్రుడు తీర్పు చెప్పారు.

వ్యక్తికి పాముకాటు

అయినవిల్లి: వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన ముద్దన ప్రకాశరావు (దొరబాబు) అనే వ్యవసాయం కూలీ పాముకాటుకు గురయ్యాడు. పొలానికి వెళ్లిన అతడిని అక్కడకు వరదకు కొట్టుకు వచ్చిన పొడపాడు కాటేసింది. గమనించిన స్థానికులు దొరబాబును వెంటనే స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స అనంతరం పరిస్థితి ప్రమాదకరంగా ఉండడంతో అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లారు.

కనుమరుగు

- అన్నవరంలో మరుగుదొడ్ల దుస్థితి
- పశ్చిమ రాజగోపురం వద్ద నిర్మాణం
- రూ.10 లక్షలు ఖర్చుచేసిన దేవస్థానం
- అధ్వానంగా మారిన వైనం

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరం నిత్యం రద్దీగా ఉంటుంది. కొండపై కొలువైన వీర వెంకట సత్యనారాయణస్వామిని దర్శించుకోవడానికి అనేక మంది భక్తులు తరలివస్తారు. పండగలు, పర్వదినాలలో వీరిసంఖ్య దాదాపు రెట్టింపు ఉంటుంది. ఆలయానికి వచ్చే భక్తుల కోసం దేవస్థానం అనేక సౌకర్యాలు కల్పిస్తోంది. దానిలో భాగంగా పశ్చిమ రాజగోపురం సమీపంలో గతేడాది నవంబర్‌లో మరుగుదొడ్లను నిర్మించారు. వీటి కోసం దాదాపు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. కానీ అవి అప్పుడే నిరుపయోగంగా మారింది. దాదాపు 8 నెలలకే అధ్వానంగా తయారయ్యాయి.

ఆధునిక శైలిలో..

పశ్చిమరాజగోపురం పక్కన గల షాపింగ్ కాంప్లెక్స్ దిగువన వెస్ట్రన్ స్టైల్ కమోడ్స్‌తో పురుషులు, మహిళలకు విడివిడిగా పది మరుగుదొడ్ల నిర్మించారు. గత ఏడాది కార్తిక మాసం సందర్భంగా భక్తుల కోసం



నేలమీద ఏర్పాటు చేసిన బోర్డు

వీటిని ఏర్పాటు చేశారు. అయితే వీటిలోని వాటర్ బాక్సులను గుర్తు తెలియని వ్యక్తులు పీకేశారు. వాటికి సరఫరా అవుతున్న నీరు వృథాగా పోతోంది. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో మరుగుదొడ్ల వద్ద సిబ్బంది ప్లాస్టిక్ బకెట్లను ఏర్పాటు చేశారు. దాదాపు రూ.10 లక్షల ఖర్చుతో నిర్మించిన మరుగుదొడ్లు ఎనిమిది నెలలకే అధ్వానంగా మారాయి. వాటి పరిస్థితి చూసి భక్తులు ఎవ్వరూ లోపలకు వెళ్లడం లేదు.


అధ్వానంగా..

మరుగుదొడ్లలో సాధారణ బేసిన్లను ఉపయోగిస్తారు. కానీ వీటిలో వెస్ట్రన్ కమోడ్లు వాడడంతో చాలామందికి వినియోగించడం తెలియడం లేదు.



పశ్చిమ రాజగోపురం వద్ద గల టాయిలెట్స్‌లో కనిపించని వాటర్ బాక్సులు

పశ్చిమరాజగోపురం సమీపంలో తప్ప ఈ తరహా మరుగుదొడ్ల దేవస్థానంలో ఎక్కడా లేవు. కేశఖండనశాలలో ఉన్నప్పటికీ అవి తలనీలాలు సమర్పించిన వారికే ఉపయోగపడతాయి. సాయంత్రం ఆరు



నేలమీద పడిఉన్న వాటర్ బాక్సులు

గంటలు దాటితే వాటి గేట్లు మూసివేస్తారు. దీంతో ఈ మరుగుదొడ్లను 24 గంటలూ భక్తులు ఉపయోగించుకునే అవకాశం ఉంది. కానీ వీటి పరిస్థితి దారుణంగా తయారైంది.

లోపభూయిష్టం

మరుగుదొడ్ల నిర్వహణ మొదటి నుంచీ లోపభూయిష్టంగానే ఉంది. ఇక్కడ మరుగుదొడ్ల ఉన్న విషయం భక్తులకు తెలిసేలా కనీసం బోర్డు కూడా ఏర్పాటు చేయలేదు. వీటిలోకి వెళ్లడానికి మెట్లను కూడా దాదాపు నెలల తర్వాత నిర్మించారు. ఉన్న పది వాటిలో ఒక దాని పరిస్థితి చాలా అధ్వానంగా ఉండడంతో దాన్ని మూసివేశారు. కాగా.. పశ్చిమ రాజగోపురం సమీపంలో నిర్మించిన మరుగుదొడ్లకు వెంటనే మరమ్మత్తులు చేయించాలని దేవస్థానం అధికారులకు చైర్మన్ ఐవీ రోహిత్ ఆదేశించారు. వాటి పరిస్థితిని ఆయన దృష్టికి తీసుకువెళ్లడంతో ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

యథాస్థానాలకు సబ్ రిజిస్ట్రార్లు

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో పని చేస్తున్న సబ్ రిజిస్ట్రార్ల డిప్యూటేషన్‌ను రద్దు చేసి, వారిని యథాస్థానానికి బదిలీ చేస్తూ స్టాంప్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ రాష్ట్ర ఐజీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నేపథ్యంలో కాకినాడ రూరల్ మండలం సర్పవరం సబ్ రిజిస్ట్రార్‌గా డిప్యూటేషన్‌పై విధులు నిర్వహిస్తున్న సి.రమేష్ మామిడికుదురుకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో కాకినాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయంలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కేవీ శ్రీనివాసరెడ్డిని ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్‌గా నియమించారు. పిఠాపురం సబ్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వీబీ సర్వమాంబ తన యథాస్థానం భీమవరానికి సబ్ రిజిస్ట్రార్ –2గా బదిలీ అయ్యారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మలికిపురం సబ్ రిజిస్ట్రార్ ఎ.సత్యనారాయణను విజయవాడ మార్కెట్ అండ్ ఆడిట్ విభాగానికి బదిలీ చేశారు. ఆయన స్థానంలో ఎంవీ సుధారాణిని నియమించారు. ఎంవీ.సుధారాణి మలికిపురం సబ్‌రిజిస్ట్రార్ అయినప్పటికీ ఆమె డిప్యూటేషన్‌పై ఉండి విధులు నిర్వహిస్తున్నారు. డిప్యూటేషన్ రద్దు కావడంతో యథాస్థానానికి వచ్చారు.

రైతుబజార్లలో నిబంధనలు పాటించాలి



క్వారీ మార్కెట్ రైతుబజార్‌ను పరిశీలిస్తున్న సీఈవో శేఖర్ బాబు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): రైతుబజార్లలోని రైతులు, వ్యాపారులు, మహిళా సంఘాలు ప్రభుత్వ నిబంధనలు ప్రకారం నడుచుకోవాలని రాష్ట్ర రైతుబజార్ల సీఈవో డాక్టర్ జి.శేఖర్‌బాబు అన్నారు. ఎటువంటి సొంత నిర్ణయాలు తీసుకోవద్దని ఆదేశించారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం రాజమహేంద్రవరంలోని క్వారీ మార్కెట్, వై.జంక్షన్‌లోని రైతుబజార్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుబజార్లలోని సమస్యలను వెంటనే పరిష్కరించేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీని పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన బియ్యం, కందిపప్పు విక్రయాల కౌంటర్ పనితీరును తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా మార్కెటింగ్ అండ్ ట్రేడింగ్ అధికారి సునీల్ వినయ్, రైతుబజార్ల ఎస్టేట్ ఆఫీసర్లు శ్రీనివాస్, రోజియా ఉన్నారు.

ముంపు బాధితులకు అరకొర సాయం

అంబాజీపేట: గోదావరి వరద ఉధృతికి జిల్లాలో అనేక ప్రాంతాలు ముంపుబారిన పడ్డాయి. చాలా కుటుంబాలు ఇప్పటికీ తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో వారికి ప్రభుత్వం నిత్యావసరాలు పంపిణీ చేస్తుంది. అయితే వాటిని అరకొరగా అందజేస్తుండడంతో వరద బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. అంబాజీపేట మండలం నందంపూడి బొంతువారిపేట, వాకలగరువు, తొండవరం నవుండ్రువారిపేట, రజకపేటలలో 200 ఇళ్ల నీట మునిగాయి. వరద ముంపు ప్రాంతాల్లో అధికారులు తూతూమంత్రంగా సర్వే నిర్వహించి, వివరాలు నమోదు చేసుకున్నారు. దీనిలో భాగంగా 54 ఇళ్లకు సంబంధించి ఉల్లిపాయలు, బంగాళదుంపలు, బియ్యం పంపిణీ చేశారు. మిగిలిన పామాయిల్, కందిపప్పు ఇవ్వలేదు. గత రెండు రోజులుగా వరద పెరిగిపోవడం, పత్రికల్లో కథనాలు రావడంతో అధికారులు స్పందించి తిరిగి సర్వే చేసి, 56 ఇళ్లు కాకుండా 96 కుటుంబాలను గుర్తించారు. అయితే వారికి కూడా నేటికి బియ్యం, పామాయిల్, కందిపప్పు, ఉల్లిపాయలు, బంగాళాదుంపలు పంపిణీ చేయలేదు. దీనిపై తహసీల్దార్ జె.విమలకుమారిని వివరణ కోరగా.. కందిపప్పు, పామాయిల్ ఇంకా సరఫరా కాలేదన్నారు. నూతనంగా గుర్తించిన బాధితులకు ప్రభుత్వ సాయం పంపిణీ చేయాల్సి ఉందన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టామని రాగానే పంపిణీ చేస్తామన్నారు.

ఉపాధ్యాయ ఓటరు జాబితాకు షెడ్యూల్ విడుదల

కాకినాడ సిటీ: తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయుల నియోజక ఓటరు జాబితా తయారు చేసేందుకు ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. ఈ నియోజకవర్గాలకు సంబంధించి ఇప్పటికే ఉన్న ఓటర్ల జాబితాలో పేర్లు ఉన్నవారందరూ నిర్ణీత ఫారం–19 తాజాగా సమర్పించాలని డీఆర్వో డి.తిప్పేనాయక్ తెలిపారు. ఆయన బుధవారం షెడ్యూల్‌ను విడుదల చేశారు. ఏపీ శాసన మండలి తూర్పు, పశ్చిమ గోదావరి ఉపాధ్యాయుల నియోజకవర్గం ఓటరు జాబితాలో నమోదు కావడానికి ఈ ఏడాది నవంబర్ ఒకటో తేదీ వరకూ అవకాశం ఉందన్నారు. కాకినాడ, తూర్పుగోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, అల్లూరి సీతారామరాజు, (రంపచోడవరం, చింతూరు డివిజన్లు), ఏలూరు జిల్లాలలోని ప్రభుత్వ, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాల, కళాశాలల్లో పనిచేస్తున్న అర్హత గల ఉపాధ్యాయులు, లెక్చరర్లు తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు. దరఖాస్తు ఫారంతో పాటు గడిచిన ఆరేళ్లలో మూడు సంవత్సరాల పాటు ఉన్నత పాఠశాల, కళాశాలల్లో పనిచేసినట్లు ధ్రువీకరణపత్రం కలిగి ఉండాలన్నారు. 2021 డిసెంబర్ ఒకటో తేదీ తర్వాత ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులు, లెక్చరర్లు ఓటు నమోదుకు అర్హులన్నారు. మొదటి, రెండో రీపబ్లికేషన్ ఆఫ్ నోటీసులు ఈ నెల 13, 23 తేదీలో జారీ చేస్తారన్నారు. ఫారం 19 అందజేసేందుకు సెప్టెంబర్ 3వ తేదీ వరకూ అవకాశం ఉందన్నారు.

రత్నగిరిపై రయ్‌రయ్..

- త్వరలో అన్నవరానికి రెండు కొత్త బస్సులు
- కొనుగోలు చేసిన దేవస్థానం
- ఆగస్టు నెలాఖరుకు అందుబాటులోకి..

అన్నవరం: సత్యదేవుని ఆలయానికి విచ్చేసే భక్తుల కోసం అన్నవరం దేవస్థానం ఆగస్టు నెలాఖరు నుంచి మరో రెండు కొత్త బస్సులను నడపనుంది. దానిలో భాగంగా అశోక్ లైలాండ్ కంపెనీకి చెందిన రెండు బస్సు చాసిస్‌ను రూ.57 లక్షలతో బుధవారం కొనుగోలు చేశారు. వాటికి విజయవాడలోని అశోక్ లైలాండ్ షోరూమ్‌లో దేవస్థానం ఈఓ కె.రామచంద్ర మోహన్ పూజలు నిర్వహించారు. అనంతరం వాటిని నందిగామలోని బాడీ బిల్డింగ్ సెంటర్‌కు తరలించారు. 40 ప్లస్ వన్ సీట్ల కెపాసిటీ కలిగిన ఈ బస్సులు బాడీ బిల్డింగ్ పని పూర్తి చేసుకుని ఆగస్టు నెలాఖరుకల్లా దేవస్థానానికి చేరుకుంటాయని ఈఓ



నూతనంగా కొనుగోలు చేసిన బస్సు చాసిస్‌లకు పూజ చేస్తున్న ఈఓ రామచంద్ర మోహన్

తెలిపారు. వీటికి మొత్తం రూ.80.60 లక్షల వ్యయమవుతోందని వివరించారు.

తీరనున్న భక్తుల ఇబ్బందులు

అన్నవరం దేవస్థానం ప్రస్తుతం ఏడు బస్సులను నడుపుతోంది. వాటిలో రెండు బస్సులు ఎప్పుడు



రత్నగిరిపై పశ్చిమరాజగోపురం వద్ద దేవస్థానం బస్సులు

మరమ్మత్తులకు గురై షెడ్డులోనే ఉంటాయి. మిగిలిన వాటిలో మూడు రైల్వేస్టేషన్ నుంచి రత్నగిరికి, మిగిలిన రెండూ కొండదిగువ నుంచి రత్నగిరికి భక్తులను తీసుకువెళుతున్నాయి. అయితే ఇవి సమయానికి అందుబాటులో లేకపోవడంతో భక్తులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. ఫలితంగా సుమారు వంద ఆటోలు రైల్వేస్టేషన్ – రత్నగిరి మధ్య తిరుగుతున్నాయి. అన్నవరం రైల్వేస్టేషన్ నుంచి రత్నగిరికి బస్సు టిక్కెట్ రూ.20, అదే ఆటో డ్రైవర్లు ఒక్కో భక్తుడికీ రూ.50 వసూలు చేస్తున్నారు. అంతమొత్తం చెల్లించలేని భక్తులు దేవస్థానం బస్సులు వచ్చేవరకూ వేచి ఉండాల్సి వస్తుంది.

నెలాఖరుకు అందుబాటులోకి..



నూతనంగా కొనుగోలు చేసిన రెండు బస్సుల చాసిస్‌లకు బాడీ బిల్డింగ్ పూర్తి చేసి ఆగస్టు నెలాఖరు కల్లా దేవస్థానానికి పంపిస్తారు. ఈ బస్సులను నడపడం వలన భక్తులకు మరంత సౌకర్యవంతంగా ఉంటుంది. ప్రైవేటు వాహనాలలో భక్తుల నుంచి ఎక్కువ సొమ్ములు వసూలు చేస్తున్నారనే అభిప్రాయం ఉంది. కొత్త బస్సుల రాకతో ఆ సమస్యలు తప్పుతాయి.

– కె.రామచంద్ర మోహన్, ఈఓ

చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి

- నాసిరకం ఎరువులను అరికట్టాలి
- ఎరువుల ప్రయోగశాల డీడీ అరుణ్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కేంద్ర ప్రభుత్వ ఎరువుల నియంత్రణ చట్టాన్ని సమర్థంగా అమలు చేసి, నకిలీ ఎరువులు, పురుగు మందులను నియంత్రించవచ్చని కేంద్ర రాష్ట్రీయ ఎరువుల నియంత్రణ ప్రయోగశాల ఉప సంచాలకుడు అరుణ్ అన్నారు. రాజమహేంద్రవరంలో మూడు రోజుల పాటు వివిధ జిల్లాల మండల



కార్యక్రమానికి హాజరైన వ్యవసాయాధికారులు

వ్యవసాయ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులకు నిర్వహించిన శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. సభకు ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ మండలాల్లోని ఎరువులు, పురుగు మందుల దూకాణాలను నిత్యం పర్యవేక్షించి, రైతులకు నాణ్యమైన ఎరువులు పురుగు మందులు అందించేలా వ్యవసాయ అధికారులు కృషి చేయాలన్నారు. ఎరువులు, పురుగు మందులు నిత్యావసర చట్ట పరిధిలోకి వచ్చినందున, అక్రమాలను నిరోధించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి దుకాణం వద్ద నిల్వ బోర్డులు ప్రదర్శించాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలన్నారు. వ్యవసాయ శాఖ అదనపు సంచాలకుడు కృపాదాస్ మాట్లాడుతూ మండల వ్యవసాయ అధికారులు ఆయా మండలాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. తద్వారా పారదర్శకంగా దుకాణాల నిర్వహణ జరగాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవరావు మాట్లాడారు. కైకలూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు గంగాధర్ ఎరువుల నియంత్రణ చట్టంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరం, కోరుకొండ సహాయ వ్యవసాయ సంచాలకులు శ్రీనివాసరెడ్డి, మల్లికార్జునరావు, వ్యవసాయ అధికారులు భీమరాజు, శ్రీనివాస్, సూర్యరమేష్, శాంతా ఆలివ్, వాణి తదితరులు పాల్గొన్నారు.

పీఈటీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకినాడ సిటీ: ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, తూర్పుగోదావరి జిల్లాలలో నిర్వహిస్తున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల విద్యాలయాల సంస్థల్లో ఖాళీగా ఉన్న ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ల (పీఈటీ) భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. జిల్లా సమన్వయాధికారి జి.వెంకటరావు బుధవారం ఈ విషయాన్ని తెలిపారు. 2024–25 విద్యాసంవత్సరానికి గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన భర్తీ చేస్తామన్నారు. గతంలో గురుకులంలో పని చేసిన వారికి ఏడాదికి ఒక మార్కు చొప్పున గరిష్టంగా ఐదు మార్కులు ఇస్తామన్నారు. ఆసక్తి కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి తమ దరఖాస్తులను ఈ నెల 3వ తేదీలోపు జిల్లా కోఆర్డినేటర్, కలెక్టరేట్ కాంపౌండ్, వికాస ఆఫీస్, కాకినాడ అనే చిరునామాలో అందజేయాలని కోరారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్

కాకినాడ క్రైం: సమస్యలు నివేదించడానికి పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సిబ్బంది, అధికారులకు ఎస్పీ విక్రాంత్ పాటిల్ సూచించారు. అమర్యాదగా ప్రవర్తిస్తున్నారంటూ పలువురు సిబ్బంది, అధికారులపై ఫిర్యాదులు అందాయన్నారు. కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళలు, బాలల సమస్యలను తక్షణం పరిష్కరించాలన్నారు. గంజాయి, రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచాలన్నారు. సోమవారం నిర్వహించే పబ్లిక్ గ్రీవెన్స్‌లో వచ్చే సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. మార్కెట్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటును ప్రతి పోలీస్ అధికారి పర్యవేక్షించాలన్నారు. సమావేశంలో అదనపు ఎస్పీలు భాస్కరరావు, శ్రీలక్ష్మి, అధికారులు పాల్గొన్నారు.

కొండచిలువ హతం

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెం ప్రధాన రహదారిలో మంగళవారం రాత్రి భారీ కొండచిలువ హల్‌చల్ చేసింది. రోడ్డు దాటుతుండగా స్థానికులు, ప్రయాణికులు గుర్తించారు. సుమారు 8 అడుగులు పొడవు ఉన్న కొండ చిలువను చూసి భయభ్రాంతులకు గురయ్యారు. అటుగా వెళుతున్న ఓ వ్యక్తి కొండ చిలువను హతమార్చాడు. వరదలకు పాములు కొట్టుకు వస్తున్నాయని, నివాస ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పలువురు పేర్కొన్నారు.

అన్నవరానికి కొత్త ఈఓగా రెవెన్యూ అధికారి!

అన్నవరం: వీర వేంకట సత్యనారాయణస్వామి దేవస్థానానికి నూతన కార్యనిర్వాహణాధికారి (ఈఓ) సీనియర్ రెవెన్యూ అధికారిని నియమించేందుకు రంగం సిద్ధమైంది. రాయలసీమ జిల్లాలో ఆర్డీఓగా పనిచేస్తున్న ఆ అధికారి కోస్తా జిల్లాలో బలమైన సామాజిక వర్గానికి చెందినవారని, గతంలో తొండంగి ఎంఆర్‌ఓగా పనిచేశారని తెలుస్తోంది. అతడిని ఈఓగా నియమించాలని మెట్ట ప్రాంతానికి చెందిన ముగ్గురు ఎమ్మెల్యేలు సిఫారసు చేయడంతో ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని, రెండు మూడు రోజుల్లో ఆదేశాలు వెలువడతాయని సమాచారం. తిరుపతి ఆర్‌జేసీగా పనిచేస్తున్న ఎన్‌వీ సత్యనారాయణమూర్తి ఈఓగా నియమించాలని తొలుత ప్రయత్నాలు జరిగినా ప్రజాప్రతినిధులు ఆర్డీఓ వైపు మొగ్గు చూపడంతో ఆ ప్రయత్నాలకు బ్రేక్ పడినట్టు చెబుతున్నారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో గతంలో ఈఓలుగా రెవెన్యూ అధికారులను నియమించారు. 2002లో దేవస్థానం ఈఓగా గ్రూప్ వన్ అధికారి ఎంవీ శేషగిరి బాబు, ఆయన బదిలీ తరువాత ఇన్‌చార్జి ఈఓగా ప్రస్తుత దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ, 2015లో కాకర్ల నాగేశ్వరరావు, ఆ తర్వాత ఎం.జితేంద్రలను టీడీపీ ప్రభుత్వం నియమించింది. కాగా.. దేవదాయ, ధర్మదాయశాఖ అడిషనల్ కమిషనర్–2 కె.రామచంద్రమోహన్ ప్రస్తుతం దేవస్థానం ఈఓగా పనిచేస్తున్న విషయం తెలిసిందే. ఆయన వ్యక్తిగత కారణాలతో ఈ నెల ఏడు నుంచి 15 రోజులు సెలవు పెడుతున్నారు. ఈ లోపుగానే దేవస్థానం ఈఓగా మరొకరిని నియమించే అవకాశం ఉంది. రామచంద్రమోహన్‌కు గత నెలలో కమిషనర్ కార్యాలయంలో కీలక బాధ్యతలు అప్పగించిన విషయం విధితమే. రాష్ట్ర వ్యాప్తంగా దేవదాయ, ధర్మదాయశాఖలోని ఏసీ క్యాడర్ నుంచి ఆర్‌జేసీ క్యాడర్ వరకు సిబ్బంది విధులకు సంబంధించిన ఫైళ్లను ఆయన పరిష్కరించాల్సి ఉంది. దీంతో పాటు అన్నవరం దేవస్థానంలో కీలక నిర్ణయాలు తీసుకోవాలి. ఇందులో భాగంగా వారంలో సోమవారం నుంచి గురువారం వరకు కమిషనర్ కార్యాలయంలో, మిగిలిన మూడు రోజులు అన్నవరం దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్నారు.

బాల దివ్యాంగుల పరిరక్షణకు కృషి

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): బాల దివ్యాంగుల పరిరక్షణకు కృషి చేయాలని, వారికి విద్య, వైద్యం తదితర సౌకర్యాలు కల్పించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. స్థానిక కోర్టు ఆవరణలో మంగళవారం వివిధ శాఖల ప్రభుత్వ అధికారులు, స్వచ్ఛంద సంస్థలతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ బాల దివ్యాంగులు తమ హక్కులకు దూరం కాకూడదని, వివిధ కారణాల చేత పొందలేకపోతే సంబంధిత శాఖ అధికారులు వారికి చేయూత ఇవ్వాలన్నారు. ప్రభుత్వం అమలు చేసే వివిధ పథకాలను వారి వద్దకు చేర్చాలన్నారు. సమావేశంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రకాష్ బాబు, 3వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి గంధం సునీత

మేజిస్ట్రేట్ శ్రీరమ్య, 7వ అదనపు జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ పి.బాబు, ఐసీడీఎస్ పీడీ కె.విజయకుమారి, మానసిక వైద్య నిపుణులు డాక్టర్ కర్రి రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల ప్రక్షాళనకు చర్యలు

మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

రావులపాలెం: రాష్ట్రంలో దేవాలయాలను ప్రక్షాళన చేసేందుకు చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. అనపర్తి నియోజకవర్గంలో జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళ్తున్న ఆయన మార్గ మధ్యంలో బుధవారం రాత్రి రావులపాలెంలోని డీసీఎంఎస్ మాజీ చైర్మన్ కేవీ సత్యనారాయణ రెడ్డి ఇంటి వద్ద కాసేపు ఆగారు. మంత్రికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ కేవీ సత్యనారాయణ రెడ్డి, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ తదితరులు స్వాగతం పలికారు. దేవదాయ శాఖలో రిజిస్టర్ అయిన సుమారు 5,400 ఆలయాల్లో అర్చకులకు ధూప దీప నైవేద్యాలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం రూ. 10 వేలు ఇస్తామన్నారు. ఆదాయం రూ. 50 వేల కంటే తక్కువగా ఉన్న దేవాలయాలకు రూ. 15 వేలు అందిస్తామన్నారు. రాష్ట్రంలో దేవదాయ శాఖకు అన్ని ఆలయాలకు కలిపి ఐదున్నర లక్షల ఎకరాల భూమి ఉందన్నారు. ఇందులో సుమారు లక్షా 60 వేల ఎకరాలు ఇనాం సర్వీస్ భూములుగా ఇవ్వడం జరిగిందన్నారు. త్వరలో దేవాలయాలకు నూతన పాలక మండలి కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు.